## ఆదిలాబాద్ తుది ఓటరు జాబితా విడుదల

ఎదులాపురం, ఫిబ్రవరి 8 : 'ఓటర్ల జాబితా సవరణ 2024'లో భాగంగా తుది ఓటరు జాబితాను విడుదల చేశామని ఆదిలాబాద్ ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో సాధారణ ఓటర్లు 4,54,450 కాగా.. ఇందులో పురుషులు 2,21,487, స్త్రీలు 2,32,955, ఇతరులు 8 మంది ఉన్నారు. కాగా.. ఎన్ఆర్ఐ ఓటర్లు 14, సర్వీస్ ఓటర్లు 784 మంది ఉన్నారు. తుది జాబితా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గ కార్యాలయాలు, అన్ని పోలింగ్ కేంద్రాలు, బూత్ లెవెల్ అధికారి వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు.

## సీఎంఆర్ బియ్యం సేకరణకు గడువు పొడిగింపు

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 8 : నిర్మల్ జిల్లాలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైస్‌మిల్లర్లకు కేటాయించిన సీఎంఆర్ బియ్యం సేకరణకు ఈనెల చివరి వరకు గడువు విధించిందని ఆ శాఖ జిల్లా అధికారి శ్రీకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వం చాలా సార్లు సీఎంఆర్ బియ్యాన్ని అప్పగించాలని రైస్‌మిల్లర్లకు సూచించినప్పటికీ.. ఇంకా కొందరు అప్పగించాల్సి ఉందని తెలిపారు. ఈనెలాఖరు వరకు అన్ని రైస్‌మిల్లుల్లో ఉన్న ఖరీఫ్, రబీ సీఎంఆర్ బియ్యాన్ని వెంటనే అప్పగించాలని ఆమె సూచించారు.

## జీతాలు మహాప్రభో..



నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు

ఉట్నూర్, ఫిబ్రవరి 8 ః మూడు నెలలుగా జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉట్నూర్ ప్రభుత్వ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకుడు సుభాష్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నప్పటికీ, జీతాలు రావడం లేదన్నారు. దీంతో సిబ్బంది సరైన సమయంలో పిల్లల ఫీజులు కట్టుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్ఎంవో మహేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో చాగు, మహేశ్, వీణ, సూర్య, నర్మద, భాను ప్రసాద్, అరుణ్, పరశురాం, వెంకటేశ్, గంగాధర్ పాల్గొన్నారు.

# పడియోరుకు వేళాయే..

## నేటి అర్ధరాత్రి మహాపూజకు ముస్తాబైన నాగోబా ఆలయం


కేస్లాపూర్ గర్భగుడిలో నాగోబా విగ్రహం



మర్రిచెట్టుపై భద్రపర్చిన గంగాజలం ఝరి




తుమ్ పూజల కోసం నైవేద్యాలను సేకరిస్తున్న మెస్రం వంశీయులు

- ఆదివాసుల అతిపెద్ద పండుగకు సర్వం సిద్ధం చేసిన మెస్రం వంశీయులు
- ఆదివాసీ గిరిజనుల సంస్కృతిని ప్రతిబింబించేలా ఏర్పాట్లు
- 9 నుంచి 15వ తేదీ వరకు జాతర.. 12న ప్రజాదర్బార్

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 8 : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌లో గల నాగోబా(పడియోరు) జాతరకు వేళయింది. నేడు(శుక్రవారం) పుష్యమాసంలో వచ్చే అమావాస్య కావడంతో అర్ధరాత్రి నాగోబాకు మెస్రం వంశీయులు మహాపూజ నిర్వహించడంతో జాతర ప్రారంభమవుతుంది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కలమడుగు వద్ద గల గోదావరి(హస్తలమడుగు) నుంచి గంగాజలాన్ని(ఝరి) తీసుకొచ్చారు. ఈ జలంతో శుక్రవారం అర్ధరాత్రి మహాపూజలో భాగంగా నాగోబాకు అభిషేకం చేస్తారు. దీంతో జాతర అధికారికంగా ఏడు రోజుల పాటు కొనసాగుతుంది. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల సంఖ్యలో తరలివస్తారు. విదేశాల నుంచి పర్యాటకులు, సందర్శకులు వచ్చి దర్శించుకుంటారు. ఇప్పటికే గంగాజలంతో మర్రిచెట్ల వద్ద మెస్రం వంశీయులు కుటుంబ సమేతంగా ఐదు రోజులపాటు బస చేశారు. నేటి సాయంత్రం సంప్రదాయబద్ధంగా ఎడ్లబండ్లలో గోవాడ్‌కు చేరుకుంటారు. రాత్రి ఆలయాన్ని పవిత్ర గంగాజలంతో శుద్ధి చేసి నాగోబాకు అభిషేకం చేస్తారు. నైవేద్యం సమర్పించి మహాపూజ నిర్వహిస్తారు. ఆలయంలో ఏడు రకాల పాముల పుట్టలను తయారు చేస్తారు. వీటికి ఐదు రోజులపాటు ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకుంటారు. దీంతో నాగోబా అనుగ్రహం కలుగుతుందని మెస్రం వంశీయులతోపాటు ఆదివాసీ గిరిజనుల నమ్మకం. కాగా, ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు.


నాగోబా జాతర ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

### నాగోబా చరిత్ర..

కేస్లాపూర్ నాగోబా జాతరకు ఘనమైన చరిత్ర ఉంది. క్రీ.శ.740లో కేస్లాపూర్ గ్రామ గిరిజనుడు పడియోరు శేషసాయి అనే నాగభక్తుడు నాగదేవతను దర్శించుకోవడానికి నాగలోకానికి వెళ్లాడు. అక్కడ ద్వారపాలకులు అడ్డగించి నాగరాజు లేరని చెబుతారు. శేషసాయి నిరుత్సాహంతో నాగరాజు శేషతల్పం తాకి వెనుదిరుగుతాడు. దానధర్మాలు చేయడం ప్రారంభిస్తాడు. లోక సందర్శనం ముగించుకున్న నాగరాజు శేషతల్పంపై ఆసీనుడవుతాడు. శేషతల్పాన్ని మానవుడు తాకిన విషయం తెలుసుకుని నాగేంద్రుడు ఆగ్రహిస్తాడు. శేషసాయిని అంత మొందించేందుకు భూలోకానికి వస్తాడు. గమనించిన శేషసాయి ప్రాణభీతితో కాలజ్ఞాన పురోహితుడు ప్రధాన్ పడమార్ దగ్గరకు వెళ్తాడు. నాగరాజును శాంతిపజేసే మార్గాన్ని తెలుసుకుంటాడు. ఏడు కడవల ఆవుపాలు, పెరుగు, నెయ్యి, తేనె, బెల్లం, పెసరపప్పు వంటి ఏడు రకాలతో నైవేద్యం సమర్పిస్తాడు. గోదావరి వద్ద గల హస్తలమడుగు నీటిని 125 గ్రామాల మీదుగా ప్రయాణించి ఆ గంగాజలంతో నాగరాజును అభిషేకిస్తాడు. దీంతో కేస్లాపూర్ వద్ద ఉన్న పుట్టలోకి నాగరాజు వెళ్లి అక్కడే తన నివాసంగా మార్చుకుంటాడు. అప్పటి నుంచి యేటా పుష్య మాసం అమావాస్య రోజున అర్ధరాత్రి మెస్రం వంశీయులు నాగోబాకు మహాపూజ నిర్వహిస్తున్నారు.

### మెస్రం వంశీయులే అర్చకులు..

నాగోబా దేవతకు మెస్రం వంశీయులే అర్చకులుగా వ్యవహరిస్తూ మహాపూజ నిర్వహిస్తారు. మెస్రం వంశంలో 22 తెగలు ఉన్నాయి. ఇందులో ఏడుగురు దేవతలను కొలిచేవారంతా మెస్రం వంశస్తులు. మడావి, మర్సుకోల, పుర్కా, మెస్రం, వెడ్మ, ఫంద్రా, ఉర్వేత ఇలా ఇంటిపేర్లు గలవారు మెస్రం వంశంలోకి వస్తారు. కాగా.. వీరు మహాపూజ నిర్వహించిన అనంతరం ఇతరులు నాగోబాను దర్శించుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఇది మెస్రం వంశీయుల సంప్రదాయం.

### గోవాడ్‌లో 22 పొయ్యిలపై వంటలు..

మెస్రం వంశానికి చెందిన మహిళలు వంటలు చేయడానికి గోవాడ్‌లో 22 పొయ్యిలను ఏర్పాటు చేస్తారు. మహాపూజకు కావాల్సిన నైవేద్యాలు వండుతారు. గోవాడ్‌లో ఇతరులు రాకుండా నిబంధనలు విధిస్తారు. వందలాది మంది మెస్రం వంశస్తుల మహిళలు వంతులవారీగా వంటలు చేస్తారు.

### దర్బార్ ప్రత్యేకత..

జాతర సందర్భంగా యేటా నిర్వహించే దర్బార్‌కు ప్రత్యేకత ఉంది. 78 ఏండ్ల క్రితం మారుమూల గ్రామాలకు సౌకర్యాలు లేవు. గిరిజనుల వద్దకు అధికారులు వచ్చేవారు కాదు. ఈ సమయంలోనే గిరిజనుల స్థితిగతులపై అధ్యయనం చేయడానికి మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్‌డార్ఫ్ జిల్లాకు వచ్చారు. కేస్లాపూర్‌లో జరిగే జాతర గురించి తెలుసుకున్నారు. దీనిని గిరిజనుల సమస్యల పరిష్కారానికి వేదికగా మార్చుకుని దర్బార్ ఏర్పాటు చేశాడు. ఇందులో గిరిజనుల సమస్యలపై చర్చించారు. హైమన్‌డార్ఫ్ 1946లో మొదటి దర్బార్‌ను నాగోబా జాతరలో నిర్వహించారు. అప్పటి నుంచి యేటా గిరిజనులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ దర్బార్‌ను ఐటీడీఏ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారు.

# ఇంకెన్నాళ్లు..!

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని అధికారులు
- టోకెన్ల కోసం గంటల తరబడి క్యూలైన్లు

## ఆధార్ అప్‌డేట్ కోసం నాలుగు నెలలుగా అవస్థలు


ఆదిలాబాద్ పట్టణంలోని రాంనగర్ ఆధార్ కేంద్రం వద్ద జనం

ఆదిలాబాద్, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ) ః ఆదిలాబాద్ జిల్లా జనాభా సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 7,08,972 ఉంది. ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండాలనే నిబంధనల మేరకు ఆధార్ కార్డులు తీసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాల లబ్ధిపొందడంలో భాగంగా, గుర్తింపు, చిరునామా, ఇతర అవసరాలకు 12 అంకెల ఆధార్‌కార్డు తప్పనిసరిగా మారింది. విద్యార్థుల చదువులు, స్కాలర్ షిప్‌లకు కార్డు ఉండాల్సిందే. పదేండ్ల క్రితం తీసుకున్న ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రజలు కొన్ని రోజులుగా ఆధార్ కేంద్రాల వద్ద బారులుదీరుతున్నారు. రోజుల తరబడి కేంద్రాలకు పోతున్నా వారికి సవరణలు, కొత్త కార్డులు తీసుకునే అవకాశం లభించడం లేదు. భారీ సంఖ్యలో ప్రజలు వస్తుండడంతో నిర్వాహకులు టోకెన్లు జారీ చేస్తున్నారు. పది, పదిహేను రోజులకు ఒకసారి టోకెన్లు ఇస్తుండడంతో రెండు గంటల వ్యవధిలో టోకెన్లు జారీ పూర్తి కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 5 గంటలకు ఆధార్ కేంద్రాలకు చేరుకుంటున్నారు. గురువారం పట్టణంలోని రాంనగర్ ఆధార్ కేంద్రం వద్ద టోకెన్ల పంపిణీ విషయం తెలుసుకున్న జనం భారీ సంఖ్యలో చేరుకున్నారు. నాలుగైదు గంటలపాటు క్యూలైన్‌లో నిల్చున్నారు. మహిళలు, వృద్ధులు క్యూలో నిలబడ లేక ఇబ్బందులు పడ్డారు.

### నాలుగు నెలలుగా ఇదే సమస్య

ఆధార్ కేంద్రాల్లో టోకెన్ల విషయం తెలియని వారు తమ కార్డుల్లో మార్పులు చేర్పుతోపాటు పిల్లలకు కొత్త కార్డులు, వేలి ముద్రల నిర్ధారణ, ఫోన్ నంబర్‌లు నమోదు కోసం సంబంధిత ఫారాలు నింపుకుని కేంద్రాలకు చేరుకుంటున్నారు. కుటుంబసభ్యులు, పిల్లాపాపలతో కేంద్రాల వద్దకు చేరుకున్న వారి దరఖాస్తులను స్వీకరించడానికి నిరాకరిస్తున్నారు. తాము ముందుగా టోకెన్లు జారీ చేసిన వారి దరఖాస్తులు తీసుకుంటున్నామని సమాధానం ఇస్తున్నారు. ఈ సమస్యను ఎవరికి తెలియజేయాలన్ని సంబంధింత అధికారుల ఎవరూ తెలియకపోవడంతో జనం చేసేది లేక వెనుదిరుగుతున్నారు. జిల్లాకు చెందిన వారు ఉద్యోగం, వ్యాపారం, ఉపాధి కోసం ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. వారు అప్‌డేట్ కోసం తమ సొంత గ్రామాలకు వచ్చి కేంద్రాల్లో సంప్రదిస్తున్నా పని కావడం లేదు. ప్రజలు నాలుగు నెలలుగా ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### టోకెన్ కోసం పొద్దున 4 గంటలకు వచ్చిన..



*ఆధార్ కార్డులో సవరణ కోసం రాంనగర్ కేంద్రానికి దరఖాస్తు తీసుకుని పోతే ఇప్పుడు చేయడం కుదరదు, టోకెన్లు ఇచ్చినప్పుడు రామన్నారు. గురువారం పొద్దున టోకెన్లు ఇస్తున్నారని తెలుసుకుని నాలుగు గంటలకు వచ్చిన. ఇప్పుడు 9 గంటలు అవుతున్నది. దాదాపు ఐదు గంటల నుంచి క్యూలైన్‌లో నిల్చున్నా. మా కుటుంబంలో ఆరు టోకెన్లు అవసరం ఉన్నాయని ఇవ్వాలని అడిగితే వాళ్లు ఒకటి మాత్రమే ఇచ్చారు. ఆధార్ కార్డుల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు.*

**- ప్రీతి, ఆదిలాబాద్**

## పారదర్శకంగా ఓటరు జాబితాను రూపొందించాలి..

- ఎలక్టోరల్ అబ్జర్వర్ భారతీ లక్‌పతినాయక్



సమీక్షలో పాల్గొన్న భారతీ లక్‌పతినాయక్

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 8 ః వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేయాలని ఎలక్టోరల్ అబ్జర్వర్ భారతీ లక్‌పతినాయక్ అన్నారు. గురువారం నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల ఓటరు జాబితాపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓటరు జాబితాలో తప్పులేకుండా సమగ్రంగా రూపొందించాలని పేర్కొన్నారు. చనిపోయిన ఓటరు వివరాలను కచ్చితంగా తొలిగించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి జాబితాను తయారు చేయాలన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణపై అధికారులు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. బీఎల్‌వోల పనితీరును పరిశీలించాలని ఓటర్లు ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి మార్పులు, చేర్పులు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, వికలాంగులకు రాంప్యాడ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఓటరు స్లిప్‌లను తయారు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, రాహుల్ పాల్గొన్నారు.

# ఇసుకాసురులు

## కృత్రిమ కొరతతో అక్రమార్కులకు కాసుల వర్షం

- తక్కువ సంఖ్యలో క్వారీలకు అనుమతి
- ఇదే అదనుగా జోరుగా దందా.. బహిరంగ ప్రదేశాల్లో డంపులు
- ఒకే చలాన్‌తో 10 నుంచి 20 ట్రిప్పులు రవాణా
- అనుమతి లేని ప్రాంతాల నుంచి యథేచ్ఛగా తరలింపు
- చోద్యం చూస్తున్న టీఎస్ఎండీసీ, స్థానిక సంస్థల అధికారులు



ఎర్రాయిపేట క్వారీ నుంచి పట్టపగలే లారీల్లో ఇసుక తరలించుకొని వెళ్తున్న దృశ్యం

మంచిర్యాల, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇసుక కృత్రిమ కొరత అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తున్నది. తక్కువ సంఖ్యలో క్వారీలకు అనుమతి ఇవ్వడంతో ఇసుక దొరకడమే బంగారమైపోయింది. ఉమ్మడి జిల్లాలో.. ఒక్క మంచిర్యాల మినహా మిగిలిన జిల్లాల్లో ఎక్కడా అధికారికంగా క్వారీలకు పర్మిషన్ లేదు. టీఎస్ఎండీసీ పరిధిలో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం కొల్లూర్, జైపూర్ మండలం వేలాల క్వారీలతో పాటు స్థానిక సంస్థల పరిధిలో చెన్నూర్ బతుకమ్మ వాగు, నెన్నెలలోని ఖర్జి వాగు, హాజీపూర్ మండలం వేంపల్లి గోదావరి నుంచి ఇసుక తవ్వేందుకు అనుమతులు ఉన్నాయి. వాస్తవానికి ఈ సీజన్‌లో కోటపల్లి మండలం బోరంపల్లి, ఎర్రాయిపేట, చెన్నూర్ చింతలపల్లితో పాటు క్వారీ అన్నింటికీ అనుమతులు ఇచ్చేవారు. ఆసిఫాబాద్ జిల్లా దహెగాంలో ఒక రీచ్ నడిచేది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ఇసుక తవ్వకాలకు అవకాశం ఎక్కడా లేదు. దీంతో ఇసుక కోసం మంచిర్యాల జిల్లాపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తున్నది. దీనికితోడు ఈ సారి క్వారీల సంఖ్య తగ్గించడంతో ఇసుక కోసం జనాలు వేతకాల్సి వస్తున్నది. ఇదే అదునుగా భావించి కొందరు అక్రమార్కులు ట్రాక్టర్లు, లారీలతో ఇసుక అక్రమ రవాణాకు తెగపడుతున్నారు.

### యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు..

పర్మిషన్ ఉన్న క్వారీలతో పాటు అనుమతి లేని ప్రాంతాల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. టీఎంఎండీసీ అధికారులు ఇచ్చిన వివరాల ప్రకారం కోటపల్లి మండలం కొల్లూర్‌లో మాత్రమే అనుమతులతో ఇసుక తీయాల్సి ఉంది. కానీ ఎర్రాయిపేట క్వారీలో ప్రతి రోజూ వందల సంఖ్యలో లారీలు ఇసుక తవ్వుకొని వెళ్తున్నాయి. చెన్నూర్ మొదలుకొని.. ఇందారం వరకు గోదావరి పొడవునా ఈ అక్రమ దందా జోరుగా సాగుతున్నది. దీంతో పాటు జిల్లా కేంద్రంలోని రాళ్లవాగు, పాత మంచిర్యాల, చెన్నూర్‌లోని సుద్దాల వాగు, భీమారం గొల్ల వాగు, వేమనపల్లిలోని నీల్వాయి వాగుల్లో ఎక్కడపడితే అక్కడ.. ట్రాక్టర్లు పెట్టి పగలూ.. రాత్రీ తేడా లేకుండా ఇసుక తోడేస్తున్నారు. నిర్మల్ జిల్లాలోనూ ఈ దందా నడుస్తున్నది. నిర్మల్, సారంగాపూర్, సోన్ మండలాల్లో ప్రవహించే స్వర్ణ వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. అలాగే ఖానాపూర్ మండల పరిధిలోని రాజుర, మందపల్లి గ్రామాల మీదుగా వెళ్లే పలికేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా నడుస్తున్నది. ఆసిఫాబాద్‌లో కుమ్రం భీం ప్రాజెక్టు, ప్రాణహిత ప్రాంతాల్లో ఎక్కడ ఇసుక మేటలు కనిపించినా అక్రమార్కులు వదలకుండా తరలించుకొని వెళ్తున్నారు. ఇలా అక్రమ మార్గంలో తీసుకువచ్చిన ఇసుకను ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ డంపు చేస్తున్నారు. పొలాలు, వ్యవసాయ భూములు, పట్టణ ప్రాంతాల్లో ఇండ్ల మధ్య ఖాళీ స్థలాల్లో ఇసుక కుప్పలు తెచ్చి పోస్తున్నారు. సీజన్‌లో తెచ్చిపోసే ఈ ఇసుక అన్‌సీజన్‌లో ఎక్కువ ధరలకు అమ్ముకుంటారు. ఇవన్నీ తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడం కొసమెరుపు.

### పర్మిషన్ ఉన్న దగ్గరే జోరుగా దందా..

అనుమతులు లేని ప్రాంతాల నుంచి ఇసుక తరలించుకొని వెళ్లడం ఒకటైతే.. అనుమతులు ఉన్న దగ్గర మామూళ్ల మత్తులో మునిగిపోయిన అధికారులు పెద్ద ఎత్తున అక్రమాలకు తెరలేపుతున్నారు. ఒక ట్రిప్పునకు పర్మిషన్ తీసుకొని ఆ చలాన్‌తో 10 నుంచి 20 ట్రిప్పులు కొడుతున్నారు. స్థానిక సంస్థల పరిధిలో నడిచే ట్రాక్టర్లలో ఈ వ్యవహారం నిత్యకృత్యంగా మారిపోయింది. ఇక లారీల సంగతైతే చెప్పాల్సిన అవసరం లేదు. ఉదాహరణకు టీఎస్ఎండీసీ ద్వారా ఆన్‌లైన్‌లో జనరేటైన ఒక చలాన్‌ను పరిశీలించినప్పుడు సాయంత్రం 4 గంటలకు పర్మిషన్ ఇచ్చినట్లు అందులో ఉంది. కానీ 4.10 గంటలకు ఆ లారీ భీమారం మండల కేంద్రం మీదుగా వెళ్తుంది. 10 నిమిషాల్లో ఆ లారీ 26 కిలోమీటర్ల దూరం ఇసుక లోడ్ నింపుకొని, అంత హెవీలోడ్‌లో ఎలా వచ్చిందనేది అర్థం కాలేదు. అంటే పర్మిషన్ రావడానికంటే ముందే ఇసుక లోడ్ చేసి ఉండాలి.. లేదా చూపిస్తున్న చలాన్ ఫేకైనా అయి ఉండాలి. ఈ ఒక్క ఉదాహరణ చాలు అధికారుల సహకారంతో ఇసుక దందా ఏ రేంజ్‌లో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. అంతా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని పైపైకి చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అధికారుల దందా ఈ తరహాలో కొనసాగుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరైనా ప్రశ్నించినప్పుడు లేదా పత్రికల్లో కథనాలు వచ్చినప్పుడు హడావుడి చేసి రెండు, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి వదిలేయడం తప్ప అంతకుమించి అధికారులు చేసేదేం లేదని జనం మండిపడుతున్నారు.

### అవసరం ఉంటే క్వారీలు పెంచుతాం



*జిల్లాలో ఇసుక అవసరాల కోసం స్థానిక సంస్థల ఆధ్వర్యంలో మూడు క్వారీలను ప్రారంభించాం. అవసరముంటే మరిన్ని పెంచుతాం. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటేనే ఇసుక తరలించేందుకు అనుమతి ఇస్తున్నాం. వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. అనుమతులు లేని ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా విషయం నా దృష్టికి రాలేదు. వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.*

**- బాలునాయక్, జిల్లా మైనింగ్ అధికారి, మంచిర్యాల**

## అత్యాచారయత్నం కేసులో మూడేళ్ల జైలు

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 8 : తొమ్మిదేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం చేసిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.500 జరిమానా విధించినట్లు జిల్లా కోర్టుల సమన్వయ అధికారి సక్రియా నాయక్ తెలిపారు. నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో జూన్ 9, 2019న తొమ్మిదేళ్ల చిన్నారి ఇంటి వద్ద ఆడుకుంటున్నది. ఇదే గ్రామానికి చెందిన షేక్ బషీర్(40) అత్యాచారయత్నానికి పాల్పడుతుండగా.. బాలిక అరవడంతో పారిపోయాడు. బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై విష్ణు ప్రకాశ్ కేసు నమోదు చేశాడు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ విశ్వాస్‌రెడ్డి 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో గురువారం జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ షేక్ బషీర్‌కు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.500 జరిమానా విధిస్తున్నట్లు తీర్పు వెల్లడించారు.